ఎన్నాళ్లని అమ్మాయిని పుట్టింట్లో ఉంచుకొనేది? అదా,ఏం సెప్పలేక ఆ గడప ఎనకాలా ఈ తలుపు ఎనకాల నిలబడి గుడ్లనీరు కుక్కుకుంటోంది. అబ్బెబ్బె! పట్టువిడుపులుండాలి మనిషన్నాక ..."

"అయితే ఏమంటావు?"

పిల్లనిచ్చుకున్నవాళ్ళం. మనకి పట్టుదలలెందుకు?"

"అంటే, సిట్టిని తోలిపెట్టమంటావు?"

"నేకపోతే ఏం చేస్తాం? ఈ సిట్టికోసం, సిట్టెమ్మ పండంటి సంసారం పాడుసేస్తామా? దీన్ని తోలించుకొని వస్తే కాని గడప ఎక్కనిచ్చేది నేదు అన్నాట్ట అల్లుడు. పైగా సంటిదానికి పాలు ఎలాగా సరిపోడం నేదు. సిట్టిని తోలెడితే సంటిదాని పాలకేనా అక్కరికి వస్తుంది".

"దాని పోతపాలకి కావాలంటే పది ఆవులు పంపిస్తాను. నా సిట్టినే పంపాలని ఎక్కడుంది?"

"అయ్యో రామా! మీరు మళ్ళీ మొదటికొస్తున్నారు. వాళ్ళకి ఆవుటండీ ముఖ్యం".

"కాదు. సిట్టే ముఖ్యం. ఏడుపుగొట్టోళ్లు సిట్టిని నే చస్తే పంపను" గట్టిగా అరిచాడు రెడ్డెయ్య.

అమ్మాయిని చూడండి. సిన్నముకం సేసుకొని ఎలా నుంచుందో".

రెడ్డెయ్య సిట్టెమ్మవేపు సూశాడు. తటాలున వచ్చి అతని బుజంమీద తల పెట్టి ఎక్కెక్కి ఏడవసాగింది సిట్టెమ్మ.

రెడ్డెయ్య కడుపు సెరువైపోయింది. ఆమె వీపు నిమిరాడు ఆప్యాయంగా,, సేతికి వెన్నుపూస తగిలింది. సిక్కశల్యమైపోయింది ఎర్రితల్లి!

"అమ్మా!" అన్నాడు గొంతు సంబాళించుకొని.

"నాన్నా!" అని బావురుమంది సిట్టెమ్మ.

కళ్లు ఒత్తుకుని భార్యవేపు సూశాడు. పైట కొంగు నోట్లో కుక్కుకుని ఏడుపు దిగమింగుకుంటోంది.

సిట్టెమ్మకేసి సూశాడు.

రెడ్డెయ్య కళవళపడ్డాడు.

ఎనక్కి తిరిగి సిట్టిని పరకాయించాడు.

నిర్వికారంగా నెమరేస్తూ నుంచుంది.

రెడ్డెయ్య మనస్సులో చీకట్లు ముసురుకున్నాయి.

ఉన్నట్టుండి, "తోలికెళ్ళు తల్లీ!" అంటూ ముకంమీద కండువా కప్పుకొని గబగబా ఎల్లిపోయాడు సిట్టిలేని లోకంవేపు. బావురుమంటూన్న గొడ్లసాలవేపు రెడ్డెయ్య.

(విపుల, అక్టోబర్ 2003)

*

# వంటొచ్చిన మగాడు!

పూర్వం పెళ్ళిచూపుల్లో మగ పెళ్ళివారు అడిగేవారు "అమ్మాయికి వంటొచ్చా?" అని. ఇప్పుడు అమ్మాయిలకి ఉద్యోగాలు చప్పున వచ్చేసి అబ్బాయిలకి కాస్త ఆలశ్యం కావడంతో అదే ప్రశ్న అటునుంచి ఇటు తిరిగింది. నాకు తెలిసిన ఒక మెరికలాంటి కుర్రాడు, తనకి ఎలాగా ఉద్యోగం లేదు, పోనీ ఉద్యోగం చేస్తూన్న అమ్మాయినైనా పెళ్ళి చేసుకుందాం అనే సదుద్దేశంతో సిద్ధం అయితే, అందరికీ అన్నీ నచ్చి తాంబూలాల తంతుదగ్గరికి వచ్చేసరికి, దురదృష్టవశాత్తూ సంభాషణ కాస్తా ఫలహారాల్లోంచి పాకశాస్త్రంలోకి ప్రవేశించింది. దాంతో పెళ్ళి కూతురు చటుక్కున "మీకు వంటొచ్చా?" అని అడగడం, ఇతగాడు తెల్లమొహం వెయ్యడం, ఖాయం కాబోతున్న సంబంధం కాస్తా, గోవిందా అంటూ కొండెక్కిపోవడం, అన్నీ క్షణాలమీద జరిగిపోయాయి.

మరి ఎంతవరకూ నిజమో కాని ఇప్పుడు అమ్మాయిలు ఆరడుగుల ఎత్తూ, అందమైన విగ్రహం, ఆస్థీ ఆర్భాటం అంటూ పేచీలు పెట్టడంలేదు. కాబోయే శ్రీవారు జామారు బిగించి వంట చెయ్యగలరాలేదా అనిమాత్రం ఆరా తీస్తున్నారట.

అవును మరి – రోజులూ, రోజుల పరిస్థితులూ అన్నీ హాంపట్ అన్నట్లు మాయం అయిపోవడమో, అటునుంచి ఇటు తిరగబడిపోవడమో జరిగిపోతోంది. ఒక్క చేతిమీద, అందులోను సుందర సుకుమార మృదుల మంజులమైన గాజుల చేతి మీదే, వంటకాలు జరగాలంటే ఎలా? జరిపించాలని చూడ్డంమాత్రం ఏం న్యాయం. ధర్మం తెలిసిన ఏ పురుష పుంగవుడైనా, కలతలు లేని కాపురం చెయ్యదలచుకొన్న ఏ యువకిశోరమూర్తి అయినా, విధిగా, వంట నేర్చుకుని తీరాలి, ఈ రోజుల్లో.

కాదని మొరాయించినవాళ్ళు కష్టాన్ని భరాయిస్తున్నారు. అయినా నాకు తెలియకడుగతాను వంట చెయ్యడానికి పురుషుడు అంత బిడియపడ్డం, వంటింటిని పెద్దపులి బోనులా పరిగణించి పరిగెట్టి పారిపోవడం దేనికి? అసలా మాటకొస్తే, ఏ దుర్ముహూర్తంలో వంటగరిట ఎగిరివెళ్ళి ఆడవాళ్ళ చేతిలో పడిందో గాని, పూర్వం నుంచీ అది మగవాళ్ళ హస్తభూషణం. నలభీమాది మహామహుల పేర్లు జ్ఞాపకం వస్తాయి కాని, పాకకళ పేరు చెప్పేటప్పటికి, మిత్రవింద, అరవింద అంటూ ఆడవాళ్ళ పేర్లేమైనా గోచరిస్తాయేమో చూడండి మన మనోఫలకం మీద! విక్టరీస్టేండు మీద మూడు కాదు ముప్పయి స్థానాలు వచ్చినా అన్నింటిని పురుష ఛాంపియన్లే ఆక్రమించుకొని కూర్చుంటారు – లేదా నుంచుంటారు. ఆడ ఛాంపియన్ల జాడ ఏఖ్ఖడా కనిపించదు. అంతదాకా ఎందుకు – పెద్ద పెద్ద వంటలూ, వివాహం తాలుకు విందులూ వస్తే, ముందుకి ఉరికేదెవరు? ఇంకెవరు. పురుష సింహాలే! కాటేజీ ఇండస్ట్రీ అయితే కలకంఠులు సరిపోతారేమోకాని, భారీపరిశ్రమ అనేసరికి బక్కవాడైనా మొగమొక్కే దిక్కు.

"రాకెట్ ప్రస్తావనకికూడా రామాయణమే తిరగెయ్యి" అనే మా మిత్రుడొకడు ఉన్నాడు. అతను అసలు వంటొచ్చిన మగాడు. నలభీమపాకంలా నవకాయ పిండి వంటలూ నాలుగు కూరలూ వండేసి, షడ్రుచుల్నీ పంచభక్ష్యాల్లోనూ రకరకాల కాంబినేషన్లలోనూ సర్దేసి, రంజుగా వడ్డించేస్తే ఒక్క బ్రతికున్న మానవ మాత్రుడేవిటి చచ్చిస్వర్గాన ఉన్న వాళ్ళపితామహ ప్రపితామహులు కూడా అవురావురుమంటూ దివి నుండి భువికి దిగివచ్చి, సుష్టుగా భుజించి బ్రేవుమని త్రేన్చుకుంటూ, "భోజనకాలే గోవిందనామస్మరణ" అంటూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ తిరిగి స్వర్గధామం చేరుకుంటారు" అంటాడు.

అలా పధ్నాలుగు లోకాల్నీ ఘుమఘుమ లాడించి పౌరషేయంగా బ్రతికిన పాక శాస్త్రప్రావీణ్యం పావురంలా ఎగిరివెళ్ళి ఎప్పుడు ఆడవాళ్ళ చేతిలోపడిందో అంతే, అప్పటినుంచీ అంతవరకూ ఉన్న తన ఆధిక్యాన్ని కోల్పోయి తన ఇంట్లో తానే అతిథిగా మిగిలిపోయాడు పాపం మగవాడు. ఆమెగారు ఏమివండితే అదే – ఎలా వండితే అలాగే – ఎంత వడ్డిస్తే అంతే ఆరగించి, అంతటితో సరిపెట్టుకొనే దీనావస్థకి దిగజారాడు.

అంతక్రితం తన చేత్తో పదిమందికి వండి వడ్డించుకొన్నజీవి ఇప్పుడు పరాధీనంలో పడ్డాడు. మరొహరు పెడితే తినవలసిన దుస్థితి ఏర్పడింది అతనికి. ఈ దీనావస్థ గ్రహించి మగవాళ్ళలో కొందరు పురాతన వైభవాన్ని పురుషునికి సంక్రమింప

జేసే సదుద్దేశంతో నడ్డి బిగించి మహాసనంలోకి మందహాసంతో ప్రవేశిస్తున్నారంటే, మహదానందం కలుగుతోంది నాబోటివాళ్ళకి.

వంటింటి పెత్తనం స్త్రీల చేతుల్లోంచి పురుషుల చేతుల్లోకి సంక్రమిస్తూన్న సంధికాలం ఇది - అందువల్ల ఈ పరిణామసమయంలో "అన్నం వండడం, అన్యోన్యదాంపత్యం" అనే విషయానికి సంబంధించి అన్ని విషయాలూ కూలంకషంగా చర్చించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

వంటకీ, కాపురం చేసే జంటకీ సంబంధించి, మొత్తం కాపురాలన్నింటినీ నాలుగు తరగతులుగా విభజించాలి.

మొదటిది - భార్యకి వంట రాక, భర్తకి మాత్రమే వండడం తెలిసిన కాపురాలు. అటువంటివాటిలో ఎటువంటి కలతలూరావు - నిస్వార్థమైన జీవిలా, పాపం భర్తశ్రమకోర్చి రెండు పూటలా వంట చేసిపెడుతూ ఉండడంవల్ల, భార్యకి అతని మీద సహజంగా జాలీ దయా ఉంటాయి. అందువల్ల ప్రమాదాలు లేకుండా ప్రమోదంగా సాగిపోతాయి ఆ కాపురాలు.

ఇంక రెండో తరగతికి చెందినవి - ఈతరగతిలో ఇటు భర్తకీ వంట రాదు - అటు భార్యకీ వంట రాదు. ఈ కాపురాలుకూడా సజావుగానే సాగిపోతాయి. ఇద్దరి పాండిత్యం అంతంత మాత్రమే కనక, ఒకరి నొకరుహేళన చేసుకోవడం, ఎద్దేవా చెయ్యడం, చిరాకులూ ఛీత్కారాలూ ఏం ఉండవు. అన్నం చిమిడినా, పావుకిలో కూరలో అరకిలో ఉప్పు పడినా, అసలు పడకపోయినా అరుపులు కేకలూ ఏం ఉండవు. అంతగా వస్తే కూజాలో నీళ్ళుంటాయి. హోటళ్ళుంటాయి, ఫరవాలేదు.

మూడోతరగతి - భార్యకి కాస్తోకూస్తో వండడం వచ్చి ఆ రంగంలో భర్త విజ్ఞానం పూర్తిగా పూర్ణానుస్వారంగా ఉండేది. ఇక్కడా ఇబ్బంది ఉండదు. తాలింపు గాలింపుకి కూడా దొరక్కపోయినా, ఉప్పో గుప్పెడు ఎక్కువైనా, కూరపచ్చడిరూపాన్నీ, పచ్చడి పులుసురూపాన్నీ సంతరించుకున్నా, రకరకాల భక్ష్యాలన్నీ వాటి వాటి ప్రత్యేకతల్నీ విభేదాల్నీ మరిచిపోయి, అన్నీ ఒకే రంగూరుచీ వాసనలతో, ఏది ఏమిటో తెలియనంత సారూప్యంతో ఏక కుటుంబ సభ్యుల్లాగ కంచంలో దర్శనం ఇచ్చినా, భర్త అనబడే ఆ అమాయకుడు గరళ కుంఠుడిలా గటుక్కున మింగి ఊరుకోవాలేకాని, "ఇదేవిటీ, ఇలావండావు?" అనడానికి వీల్లేదు. అంటే, "మరేలా వండాలి?" అనే ప్రశ్న వస్తుందేమోనని భయం. అందువల్ల ఆ కాపురాలుకూడా సంధి చేసుకున్న రాజ్యాల్లా చల్లగా సాగిపోతాయి.

ఇంక ఎటొచ్చీ కలతలతో, ఆక్షేపణలతో, కోపాలతో, తాపాలతో నవ్వులతో, కన్నీళ్ళతో, నిత్యమూసందడిగా ఉండేవి నాలుగో విభాగానికి చెందిన కాపురాలు, అంటే, ఇరుపక్షాలకీ వంటవచ్చినవి అన్నమాట. ఇవి చూసి తీరాలి – ఇలాంటి కాపురాలు చేసితీరాలి. ఇలాంటి కాపురాల్లో ఇంటియజమాని అయిన భర్త ఆఫీసు మేనేజరుకి అన్నీ వచ్చిఉండాలి అనే న్యాయ సూత్రాన్ని పాటించే వ్యక్తి అయి ఉంటాడు. "ఇతర విషయాల్లో భయపడినా భయపడక పోయినా, వంట వస్తేమాత్రం భర్త అంటే భార్యకి తప్పకుండా పక్క బెదురుంటుంది – ఇందుకోసం అయినా భర్తలు విధిగా వంట నేర్చుకుని తీరాలి " అంటూఉంటాడు మా పక్కింటాయన.

నెలమొత్తంమీద ఏ రెండు మూడు రోజులో ఆయన చేతికి వంట వస్తుంది. ఆ రెండు మూడు రోజులూ ఆయన హడావిడి చూసితీరాలి. చుట్టుపక్కల ఇళ్ళ వాళ్ళకి మనస్థిమితం ఉండనీయడు. వంట పాత్రల చప్పుళ్ళు, వంటింటి అరుపులు, రమధోలు మేళాలూను. ఆయన చదువుకొనే రోజుల్లో, హాస్టల్ మీదా హోటల్స్ మీదా అలిగి నలుగురు సహాధ్యాయులతో కలిసి మెస్ పెట్టాడట. కళాశాల మాట ఎలా ఉన్నా వంటశాలని మాత్రం ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుతూ, వంటలు వండడంలో నూతన పద్ధతులు కనిపెట్టి వాటిని అమలు పరచడంతో, తక్కిన ముగ్గురు విద్యార్థులూ గుండెలు పగిలి హడలిపోయి మెస్ వదలి పారిపోయారట.

వాళ్ళు సహాధ్యాయులు కనక సరిపోయింది. ఈవిడ సహధర్మచారిణి ఆయె! ఈమె ఎక్కడికి పారిపోతుంది? అందుకే తన పరిశోధనలన్నీ పాపం ఆమె మీద ప్రయోగిస్తున్నాడు. చింతపండు వాడవలసిన సర్వసందర్భాలలోనూ ఆయన నిమ్మకాయే వాడతాడు ముక్కలపులుసూ వంకాయ పచ్చిపులుసుతో సహా. "ఇంగువ వేస్తే వెల్లుల్లి వెయ్యకూడదండీ" అని చెప్పినా వినడు. అవసరం ఉన్నా లేకపోయినా, ప్రతివంట కంలోనూ అవి రెండూ ఉండాల్సిందే. ఇంక వేపడాన్ని వేపడంగానూ, ముద్దకూరని ముద్దకూరగానూ వండాలంటే ఒప్పుకోడు. దొండకాయముక్కలు వేయించి, కారంజల్లి, ఆవాలు మెంతులతో పోపు పెట్టి నిమ్మకాయ పిండేవాడు. 'హ ... కొత్తిమీరి దొరకలేదు కాని ........." అంటూ ఉండేవాడు. అప్పుడు కూరముక్కలు తరిగాక, నీళ్ళల్లో కడిగి మరీ పొయ్యిమీద పెట్టాలి అనే విషయాన్ని, బెండకాయ సందర్భంలో కూడా తు.చ. తప్పకుండా పాటించేవాడు పిసికిపిసికి. ఇంక అన్నం వండడం అంటే, పొయ్యిమీద పెట్టి ఉడికాక దింపడం కాదు. మొదటినుంచి చివర దాకా, గరిటె పుచ్చుకుని లై పిండి ఉడకపెట్టినట్లు ఏకకలపడమే ఆయన థీరీ ప్రకారం. ఉల్లిపాయలు తరగడంతో మొహం ఉబ్బిపోవడం మరిచిపోయి మిరపకాయలు తుంపిన చేత్తో ఏ ముక్కో నలుపుకుని వంటింట్లో కిష్కంధాకాండ సృష్టించడం, వేడిపాల గిన్నెని పొరబాటున

పట్టుకొని ఒక్క అరుపు అరిచి, గిన్నెలూ, చెంబులూ బొమ్మలకొలువులోలాగ పెట్టుకుని అటూఇటూ తిరిగినప్పుడల్లా గోడలకి గోల్స్ చెయ్యడం ఆయన పాక శాస్త్రక్రీడల్లో ప్రముఖమైన కొన్ని ఘట్టాలు.

ఆయన చేతికి వంటొచ్చిన రోజున, లంకాదహనం సంగతి సరే - అది అలా ఉంచండి, మామూలుగా ఆవిడ వండేరోజుల్లో ఆయన మేనకా విశ్వామిత్ర ఘట్టం సాభినయంగా ప్రదర్శించేవాడు.

ఈ కూర బాగోలేదు!

ఆ పచ్చడి బాగోలేదు!

ఈ అన్నం నాకు వద్దు - అంటూ.

ఉప్పూ పులుపూ కారం, వేడీ వెచ్చనా రుచీపచీ అన్నీ ఆయన అనుకున్నట్లు ఉండాలి. సరిగ్గా - వీసం ఎత్తు తేడా వచ్చినా విరుచుకుపడేవాడు. ఏదో వంటకం ఏదో రకంగా చేస్తే ఊరుకొనేవాడు కాదు. పులుసులో పిండిపెట్టలేదనో, కూరలో ఆవ తక్కువైందనో, చారులో మెంతిగింజలు ఎక్కువయ్యాయనో, ఏదో ఒక వంక చూపించి ఇంటిని కురుక్షేత్రంగా మార్చేవాడు.

"ఈయనకి వంటరావడం నా ప్రాణానికి వచ్చింది. నిజంగా వంటసంగతి పూర్తిగా తెలుసా అంటే తెలియదు. తెలియదా అంటే తెలుసు. మా ఇద్దరికీ ఇంక ఎందులోనూ తగాదా రాదు కానీ, ఒక్క వంట విషయంలో మాత్రం చస్తున్నాం. ఆదర్శంగా ఉండవలసిన కాపురంలో అడ్డు గోడగా దాపురించిందీవంట", అంటూ ఆ ఇల్లాలు నా భార్య దగ్గర రోజుకి ఒక మారైనా కన్నీళ్ళు పెట్టుకునేది.

వంటొచ్చిన మగాళ్ళు భార్యల్ని ఇలా ఏడిపించుకు తినడంలో ఒక విచిత్రమైన మనస్తత్వం కనిపిస్తుంది.

'నాకూ వంటొచ్చును తెల్సా' అనే అహమిక. ప్రావీణ్యం బాగా సంపాదించిన పురుషుడితో ఒక గొడవైతే, పుస్తకమాత్ర విజ్ఞానంతో వంట నేర్చి "ముఖం అలా పెట్టావేం? బాగోలేదా? తిను" అంటూ వేధించుకుతినే ఔత్సాహికుడితో మరో బాధ.

ఏవైనా, వంట నేర్చిన భర్తతో కాపురం ఇల్లాండ్రకి కత్తిమీద సామే! ఎంత బాగా వండినా మెచ్చుకోరు. ఏదో ఒక లోపం చూపిస్తారు, పుస్తక సమీక్షలు చేసే విమర్శకుల్లాగ.

వంటరానివాని భార్యకి వుండే శాంతి వంటవచ్చినవాని భార్యకు ఉండదు.

"మా వారికి బాగుంటే తినడం - లేకుంటే ఊరుకోవడం. అంతకుమిక్కిలి

ఉప్పు కారాలకి సంబంధించిన ఎక్కువ తక్కువలు ఆయనకి తెలియవు" నవ్వుతూ ఆయనగారి అజ్ఞానాన్ని ఒకఘనమైన విషయంగా చెప్పుకొని గర్వపడే అదృష్టం అందరి ఇల్లాండ్రకీ లభిస్తుంది కాని, వంటొచ్చిన భర్తగారి భార్యకి పాపం లభించదు.

"ఆc! ఆయనకి తెలియందంటూ లేదీ ప్రపంచంలో" అంటూ ఒక నిట్టూర్పు విడవడం కంటే పాపం ఆమె ఇంకేమీ చెయ్యలేదు. ఈ స్థితిలో ఉన్న కొందరు ఆడవాళ్ళు, "మీ ఇంట్లో వంట మీవారే వండుతారటగా?" అని ఎవరైనా అంటే తలకొట్టేసినట్లు బాధ పడతారు.

కొందరుమాత్రం అలా బాధ పడక, పై పెచ్చు తన స్నేహితూరండ్రానందర్నీ తీసుకువచ్చి హాల్లో కూర్చోబెట్టి, "మావారు పకోడీలు ఎంత బాగా వేస్తారనుకున్నారు! ఏవండీ - ప్లీజ్ ... వేడివేడిగా పకోడీలు వేసి కాఫీ పెట్టి పట్టుకురండీ, నాకు నా ఫ్రెండ్స్‌కీను" అంటూ వంట నేర్చిన భర్తతో చేసే కాపురం ఎంత సుఖంగా ఉంటుందో అక్షరాల నిరూపిస్తారు.

పురుషుడు వంటనేర్చుకోవడంవల్ల -

కాపురంలో శ్రమ శక్తిని పంచుకొన్నవాడూ అవుతాడు.

భార్య పట్ల తనకున్న ప్రేమని ప్రదర్శించినవాడూ అవుతాడు.

అవసరం వచ్చినప్పుడు పరులపై ఆధారపడకుండా స్వయం పోషకుడుగానూ ఉంటాడు. అన్నింటికంటే ఇంట్లో మాట్లాడుకోడానికీ, శ్రుతిమించితే పోట్లాడుకోడానికీ వీలైతే ఒక అంశాన్ని సిద్ధపరచినవాడూ అవుతాడు.

కాపురాలు సందడిగానూ, సంఘటనాత్మకంగానూ, సరదాగానూ సాగాలన్నా, చిరస్మరణీయంగా మిగలాలన్నా, అన్ని కాపురాలు వంట నేర్చిన మగాళ్ళతో కలకలలాడాలి.

ప్రాచీన పాకశాస్త్ర ప్రాభవాన్ని గౌరవించే పురుషులంతా విధిగా వంట నేర్చుకుని తీరాలి.

అందుకు రోజులు కూడా, ఇందాకే మనవి చేసినట్లు, అనుకూలంగా మారుతున్నాయి అనుకోండి.

(ఆంధ్రభూమి - 1996)

*